

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక


సత్య శోధనే మా లక్ష్యం...



Contact Number
9059328777

రంగారెడ్డి సోమవారం 13-04-2026 సంపుటి: 01 సంచిక : 297 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Monday 13-04-2026 Volume :01 Issue: 297 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



## హెర్ముజ్‌ను దిగ్బంధిస్తాం..

- ఇరాన్‌తో చర్చలు విఫలం కావడంతో ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్‌కు టోల్ చెల్లించే నౌకలను అడ్డుకోవాలని నేవీకి ఆదేశం
- దుస్సాహసానికి దిగితే హెర్ముజ్ సుడిగుండాల్లో చిక్కుకుపోతారు
- అమెరికాకు ఇరాన్ గట్టి వార్నింగ్

**వాషింగ్టన్**

ఇరాన్‌తో చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక హెచ్చరిక చేశారు. హెర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. జలసంధి గుండా నౌకల రాకపోకలను యూఎస్ నేవీ తక్షణమే అడ్డుకుంటుందని తెలిపారు. జలసంధిని తెరుస్తామన్న హామీని నిలబెట్టుకోవడంలో ఇరాన్ విఫలమైందని చెప్పారు. ఇరాన్ చర్యల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయని విమర్శించారు. సముద్ర మందుపాతరల కారణంగా హెర్ముజ్‌లో ఇప్పటికే నౌకా రవాణా మందగించిందని పేర్కొన్నారు. మందుపాతరలు ఉండొచ్చని వారు చెబుతున్నారని, అలాంటప్పుడు నౌకల యజమానులు ఎందుకు రిస్క్ తీసుకుంటారని ప్రశ్నించారు. మందుపాతరలను ఆసరాగా చేసుకొని జలసంధిని

-మిగతా 2 లో



# చర్చలు విఫలం

- అమెరికా-ఇరాన్ మధ్య కుదరని శాంతి ఒప్పందం
- ఇస్లామాబాద్‌లో 21 గంటల పాటు సాగిన మంతనాలు
- బెస్ట్ ఆఫర్ ఇచ్చినా ఇరాన్ అంగీకరించలేదన్న వాన్స్
- అమెరికావి అసంబద్ధ డిమాండ్లని ఇరాన్ నాయకత్వం ఆగ్రహం

**ఇస్లామాబాద్ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)**

పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు సుదీర్ఘంగా చర్చలు సాగినప్పటికీ, శాంతి ఒప్పందంపై ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. దీంతో ఇటీవల కుదిరిన రెండు వారాల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం భవితవ్యం ప్రమాదంలో పడింది. చర్చలు విఫలం కావడానికి

-మిగతా 2 లో

# ఇంటర్‌లో బాలికలదే హవా

### ప్రతిభ చాటిన ప్రభుత్వ విద్యాసంస్థలు

- ఫలితాలు విడుదల చేసిన కె.కేశవరావు
- ఫస్టియర్‌లో 66.20 శాతం, సెకండియర్‌లో 75.34 శాతం
- రెండేండ్ల ఉత్తీర్ణత శాతం 70.60
- మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)**

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఈసారి బాలికలే పైచేయి సాధించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు సత్తా చాటాయి. 16 రకాల యాజమాన్యాల పరిధిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా, అత్యధికంగా 94.03 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు మొదటిస్థానంలో నిలిచాయి. కాంపోజిట్ యాజమాన్యంలోని విద్యార్థుల్లో ఉత్తీర్ణత 36.71 శాతంతో అతి తక్కువగా ఉంది.

-మిగతా 2 లో






## కాళేశ్వరం పనులపై స్టీరింగ్ కమిటీ

- రోజువారి పురోగతిపై ప్రత్యేక అధికారి నియామకం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణ పనుల వేగవంతానికి కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమై ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. రోజు వారి పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిజైన్ పనులు త్వరితగతిన

-మిగతా 2 లో



### 'గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్-2026' లో

## పాకిస్థాన్‌దే అగ్రస్థానం..

- పపంచవ్యాప్తంగా తగ్గుతున్న హింస.. పాకిస్థాన్‌లో మాత్రం కల్లోలం.
- ఏడాదిలో 1,139 మంది బలి: దశాబ్ద కాలంలోనే అత్యధిక మరణాలు.
- ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్.. ఉగ్రవాదానికి అడ్డాగా మారిన ప్రాంతాలు.
- పాక్ భద్రతా వ్యవస్థ వైఫల్యంపై 'అమెరికన్ థింకర్' విశ్లేషణ.

**వాషింగ్టన్**

ప్రపంచ దేశాల్లో ఉగ్రవాద దాడులు , ఉగ్రవాద దాడుల కారణంగా సంభవిస్తున్న మరణాలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. 'గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026' లో పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. గడిచిన ఏడాది అక్కడ ఉగ్రవాద సంబంధ ఘటనల్లో ఏకంగా 1,139 మంది ప్రాణాలు కోల్పోయినట్లు శనివారం విడుదలైన ఒక నివేదిక స్పష్టంచేసింది. మొరాకోకు చెందిన జర్నలిస్ట్, పరిశోధకురాలు ఫాతిమా ఎల్ హషిమి 'అమెరికన్ థింకర్' అనే ఆన్‌లైన్ మ్యాగజైన్‌లో ఈ విషయంపై విశ్లేషించారు.పాకిస్థాన్‌లో హింస ఒక సాధారణ విషయంగా మారిపోయిందని, ఇది దేశ భద్రతావ్యవస్థ తీవ్రంగా క్షీణిస్తోందనడానికి

-మిగతా 2 లో

## సౌదీకి పాక్ బలగాలు..

- 13 వేల మంది జవాన్లు, 10-18 జెట్ల తరలింపు





## 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర..

- ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్




## మధ్యవర్తిత్వానికి సిద్ధం : పుతిన్







## ఆశా భోంస్లే కన్నుమూత

- నేడు ముంబయిలో అంత్యక్రియలు
- ప్రధాని, రాష్ట్రపతి సహా పలువురి సంతాపం

**ముంబయి ఏప్రిల్ 12 (నేటి దర్శిని)**

భారతీయ సంగీత చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించిన ప్రముఖ నేపథ్య గాయని ఆశా భోంస్లే ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో ఆదివారం కన్నుమూశారు. ఆమె వయసు 92 ఏళ్లు. నీరసం, తీవ్రమైన అలసట, ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా శనివారం సాయంత్రం ఆమె ఆసుపత్రిలో చేరారు. గుండెపోటు రావడంతో మల్టీ ఆర్గాన్స్ పనిచేయక పోవడం తో ఆమె మరణించినట్లు ఆసుపత్రి అధికారులు ఆదివారం తెలిపారు. ఆమె కుమారుడు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఆమెకు నివాళులర్పించాలనుకునేవారు సోమవారం ఉదయం 11 గంటలకు నివాసానికి రావచ్చునని తెలిపారు.

-మిగతా 2 లో



### సరిహద్దుల్లో డ్రాగన్

## మరో కుట్ర?

- పీవోకే సమీపంలో చైనా కొత్త కౌంటీ!
- 'సెన్‌లింగ్' పేరుతో వ్యూహాత్మక నిర్మాణం.
- అప్రమత్తమైన భారత్

**బీజింగ్**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), అఫ్ఘానిస్థాన్ సరిహద్దు సమీపంలో చైనా కొత్త కౌంటీని ఏర్పాటు చేస్తున్నది. ఇరుకైన వఖన్ కారిడార్‌లో వీగర్ వేర్పాటువాద మిలిటెంట్ల చొరబాట్లను అడ్డుకొనేందుకు గ్జియాంగ్ ప్రావిన్స్‌లో చైనా ప్రభుత్వం ఈ కౌంటీని ఏర్పాటు చేయనున్నట్టు పీటీఐ రిపోర్ట్ చేసింది. సెన్‌లింగ్‌గా పిలువనున్న ఈ కౌంటీ కారాకోరం పర్వత శ్రేణికి దగ్గరగా వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగి ఉంటుంది.ముస్లింల ప్రాబల్యం కలిగిన వీగర్ ప్రాంతంలో ఏడాది కాలంలో చైనా ఏర్పాటు చేయనున్న మూడో కౌంటీ ఇది. క్షేత్ర స్థాయిలో బలమైన ప్రభుత్వ వ్యవస్థను నిర్మించి సమర్థమైన పరిపాలన అందించి, ఆ ప్రాంతంపై నియంత్రణ కలిగి ఉండేందుకు చైనా ఈ కొత్త కౌంటీని ఏర్పాటు చేస్తున్నదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో చైనా ఏర్పాటు చేసిన హీన్, హెకంగ్ కౌంటీలపై భారత్ తన నిరసన వ్యక్తం చేసింది.

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్

### పేరు మార్పుపై పరిశీలన చేస్తున్నాం : కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర
- పార్టీకి, ప్రజల మధ్య గ్యాప్ వల్లే గత ఎన్నికల్లో ఓడాం
- ఆ నలుగురు సీఎంలు బాగా పాలించారు

**నస్పూర్ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)**

బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ పార్టీగా పేరు మార్పు చేసే అంశాన్ని పరిశీలన చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ముగిసిన తరువాత కొంతమంది మీడియా సభ్యులతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు కీలకవ్యాఖ్యలు చేశారు. పార్టీ పేరు మార్పు గురించి ఆలోచన తమ పరిశీలనలో ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీ పేరు మార్చాక కొంత నష్టపోయిన మాట వాస్తవం అన్నారు. మళ్లీ పాత పార్టీ పేరు గురించి చర్చ జరుగుతోందన్నారు.

-మిగతా 2 లో



# చర్చలు విఫలం.

మొదటి తరువాయి



కారణం మీరంటే మీరేనంటూ ఇరుపక్షాలు పరస్పరం నిందించుకున్నాయి. యుద్ధం ముగింపునకు తుది, అద్భుత ఆఫర్‌ను అమెరికా అందించినప్పటికీ, ఇరాన్ అంగీకరించలేదని అమెరికా బృందానికి నేతృత్వం వహించిన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. అమెరికా వల్లే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ బకర్ ఘాలిబఫ్ విమర్శించారు. మా విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైందని పేర్కొన్నారు. అమెరికా అసంబద్ధ, చట్టవిరుద్ధ డిమాండ్‌లు చేసిందని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. చర్చలు విఫలం కావడంతో హెర్ముజ్ తెరుచుకోవడంపై సందిగ్ధత ఏర్పడింది. ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడులకు దిగుతుందా అన్నదానిపైనా స్పష్టత లేదు.

ఇరాన్‌కే బ్యాడ్ న్యూస్..

చర్చల అనంతరం ఇస్లామాబాద్ నుంచి అమెరికాకు బయలుదేరే ముందు వాన్స్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇరానియన్లతో 21 గంటలపాటు విస్తృత చర్చలు జరిపాం. అది గుడ్‌న్యూస్. బ్యాడ్ న్యూస్ ఏంటంటే, మేం ఒప్పందానికి రాలేకపోయాం. ఇది అమెరికా కంటే ఇరాన్‌కే ఎక్కువ బ్యాడ్ న్యూస్' అని పేర్కొన్నారు. ఇరాన్‌కు బెస్ట్ డీల్‌ను ఆఫర్ చేశామని, కానీ ఇరాన్ అంగీకరించలేదని చెప్పారు. 'ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండానే మేం అమెరికాకు తిరిగి వెళ్లిపోతున్నాం. మా రెడ్‌లైన్స్ ఏంటో వారికి స్పష్టంగా చెప్పాం' అని వాన్స్ పేర్కొన్నారు. అణ్వాయుధం తయారు చేయకూడదు అన్న షరతుతో పాటు తమ ఇతర డిమాండ్లకు ఇరాన్ అంగీకారం తెలుపలేదని చెప్పారు. భవిష్యత్తులో ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోవడానికి కానీ, తయారు చేయడానికి కానీ ప్రయత్నించకుండా ఉంటామనే స్పష్టమైన హామీని అమెరికా కోరుకుంటున్నదని పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్షుడి ప్రథమ లక్ష్యం అదే. ఈ చర్చల ద్వారా దాన్ని సాధించేందుకు ప్రయత్నించాం' అని వాన్స్ తెలిపారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి ప్రత్యక్ష చర్చలు జరగడం ఇదే మొదటిసారి. అమెరికా ప్రతినిధి బృందంలో ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేరేడ్ కుష్నర్ ఉన్నారు. ఇరాన్ ప్రతినిధి బృందంలో పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బకర్ ఘాలిబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఉన్నారు.

## హెర్ముజ్‌ను దిగ్బంధిస్తాం..

మొదటి తరువాయి

నియంత్రించేందుకు ఇరాన్ యత్నిస్తున్నదని ఆరోపించారు. ఇది దోపిడీ అని, దీనిని అమెరికా అనుమతించబోదని స్పష్టం చేశారు. ఇరాన్‌కు టోల్ చెల్లించే నౌకలను అమెరికా దళాలు అడ్డుకుంటాయని, ఈ చట్ట విరుద్ధ టోల్ చెల్లించే ఏ నౌక కూడా క్షేమంగా హెర్ముజ్‌ను దాటబోదని హెచ్చరించారు. అమెరికా దళాలపైనా, వాణిజ్య నౌకలపైనా ఇరాన్ దాడులకు దిగితే తీవ్ర ప్రతిచర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. తమపై కానీ, శాంతియుత నౌకలపై కానీ దాడులు చేసే ఇరానియన్లను పేల్చేస్తామని హెచ్చరించారు. ఇరాన్‌తో చర్చల్లో చాలా అంశాల్లో ఒప్పందం కుదిరిందని, అయితే కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపైనే ఏకాభిప్రాయం కుదరలేదని ట్రంప్ చెప్పారు. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేదన్నారు. అయితే ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధం సాధించలేదని పునరుద్ఘాటించారు. ప్రపంచంలో 20 శాతం చమురు సరఫరా హెర్ముజ్ జలసంధి గుండానే సాగుతుంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసినప్పటి నుంచి హెర్ముజ్‌ను ఇరాన్ మూసివేసింది. హెర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) తీవ్రంగా స్పందించింది. జలసంధి తమ ఆధీనంలోనే ఉన్నదని పేర్కొన్నది. శత్రువులు ఎలాంటి దుస్సాహసానికి తెగబడినా జలసంధిలోని ప్రమాదకర సుడిగుండాల్లో చిక్కుకు పోవడం ఖాయమని హెచ్చరించింది.

'గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్-2026' లో

## పాకిస్థాన్‌దే అగ్రస్థానం..

మొదటి తరువాయి

నిదర్శనమని ఫాతిమా పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదం పెరగడం ఇది వరుసగా ఆరో ఏడాది అని ఆమె గుర్తుచేశారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా మరణాల సంఖ్య పెరిగిందని తెలిపారు. 2025లో జరిగిన ఉగ్రదాడుల్లో 74 శాతానికిపైగా, మరణాల్లో 67 శాతం ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే నమోదయ్యాయని ఫాతిమా వివరించారు. ఈ ప్రాంతాల్లో పాలన, అభివృద్ధి లేకపోవడంవల్లే అంతర్గత సంఘర్షణలకు కేంద్రంగా మారాయని ఆమె అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ ఉగ్రవాద నిరోధక వ్యూహం కేవలం సైనిక చర్యలకే పరిమితమైందని, పాలనాపరమైన సంస్కరణలు, తీవ్రవాదాన్ని నిరోధించే ఇతర చర్యలు బలహీనంగా ఉన్నాయని ఫాతిమా విమర్శించారు. కేవలం సైనిక బలంతో కాకుండా రాజకీయ స్పష్టత, సమర్థవంతమైన పాలన, పొరుగు దేశాలతో సత్సంబంధాలు వంటి చర్యలు చేపడితేనే పాకిస్థాన్‌లో శాంతి నెలకొంటుందని ఆమె స్పష్టంచేశారు.

కాళేశ్వరం పనులపై

## స్టీరింగ్ కమిటీ

మొదటి తరువాయి

పూర్తి చేసి, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూ సీ) ఆమోదం కోసం పంపాలని సూచించారు. కేంద్ర జల సంఘంతో సమన్వయం చేసి అవసరమైన అనుమతులు పొందాలన్నారు. ఎల్అండ్‌టీ సహా నిర్మాణ సంస్థలు తమ క్యాంపులు, మెస్ సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇంజినీర్లు, టెక్నీషియన్లు, రిగ్ ఆపరేటర్లకు వసతి, ఆహార సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యదాస్ నాథ్, జాయింట్ సెక్రటరీ కే.శ్రీనివాస్, ఈఎన్‌సీలు రమేష్ బాబు, శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో బాలికలదే హవా

మొదటి తరువాయి

మేనేజ్‌మెంట్ల వారీగా చూస్తే టీజీఎస్‌ఆర్టీసీ 89.29, సోషల్ వెల్ఫేర్ 86.79, సెంట్రల్ గవర్నమెంట్ 86, టీఎస్ గవర్నమెంట్ స్పోర్ట్స్ 84.85, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 84.46, ట్రైబల్ వెల్ఫేర్ 84.20, బీసీ వెల్ఫేర్ 83.48, కేజీబీవీ 81.39, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 71.57, మోడల్ స్కూల్స్ 66.15, ఇన్సెంటివ్ 65.70, గవర్నమెంట్ 59.86, ప్రయివేట్ ఎయిడెడ్ 55.78, కో ఆపరేటివ్ కళాశాలలు 52.43 శాతాలతో ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ దాదాపు ఇదే రకమైన ఫలితాలు ఆయా యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాతో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బాయి, సీజీజీ డైరెక్టర్ జనరల్ రవి గుప్తా పాల్గొన్నారు.



బాలికలదే పైచేయి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు 71.12 శాతం, వొకేషనల్‌లో 65.65 శాతం మొత్తం 70.60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 66.20 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.34 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 74.40 శాతం, బాలురు 57.69 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 68.08 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 82.07 శాతంతో పైచేయి సాధించారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థుల్లో మొదటి సంవత్సరం 66.91 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 66.94 శాతానికి పెరిగింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలోనూ 71.43 శాతం నుంచి 75.61 శాతానికి చేరింది. వొకేషనల్ ఉత్తీర్ణతా శాతం మొదటి సంవత్సరంలో 57.69 శాతం నుంచి 59.30 శాతానికి, రెండో సంవత్సరంలో 67.45 శాతం నుంచి 71.15 శాతానికి పెరిగింది.

జిల్లాల వారీగా చూస్తే మొదటి సంవత్సరంలో మేడ్చల్ మల్కాజిగిరి 77.02, రంగారెడ్డి 75.69, జయశంకర్ భూపాలపల్లి 72.19 శాతంతో మొదటి మూడు స్థానాల్లో నిలవగా, రాజన్న సిరిసిల్ల 51.38, కామారెడ్డి 49.88, మహబూబాబాద్ 48.1 శాతంతో చివరి మూడు స్థానల్లో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో జయశంకర్ భూపాలపల్లి 81.95, ములుగు 81.68, కొమరం భీమ్ (ఆసిఫాబాద్) 80.57 శాతంతో మొదటి మూడు స్థానాల్లో ఉండగా, కామారెడ్డి 59.56, వరంగల్ 58.76, రాజన్న సిరిసిల్ల 55.68 శాతంతో పూర్తిగా వెనుకబడ్డాయి. గ్రూప్‌ల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే మొదటి సంవత్సరం ఎంపీసీలో 75.51, ద్వితీయ సంవత్సరంలో 78.01 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. హెచ్‌ఈసీ మొదటి సంవత్సరంలో కేవలం 34.34 శాతం, ద్వితీయ సంవత్సరంలో 49.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,70,075 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి సంవత్సరంలో 4,89,123 మంది పరీక్ష రాయగా 3,23,807 మంది, రెండో సంవత్సరంలో 5,07,948 మందికి 3,58, 490 మంది ఉత్తీర్ణులయ్యారు.

20 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ గడువు మే 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం సోమవారం (ఏప్రిల్ 13వ తేదీ) నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తు, ఫీజు చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. మే 13 నుంచి ప్రారంభం కానున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. మే 22న అడ్వాన్స్‌డ్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా నెల రోజుల్లోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వంచనున్నారు. ఇంటర్ ఫలితాలను ఈ సారి వాట్సాప్ ద్వారా చూసుకునే వెసులుబాటు కల్పించారు.

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్

మొదటి తరువాయి

ఇటీవల కవిత తాను పెట్టబోయే పార్టీకి టీఆర్ఎస్ పేరు పెడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో కేటీఆర్ పార్టీ పేరు మార్పు గురించి మీడియాతో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇంకా అనేక విషయాలను కేటీఆర్ వివరించారు. గతంలో తాము చేసిన చిన్నచిన్న తప్పుల వల్ల పార్టీకి, ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ అన్నారు. జరిగిన తప్పులపై అద్యయనం చేశామని, లోపాలను సరిదిద్దుకుంటామని తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని, కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌తో తెలంగాణలో 179 అసెంబ్లీ సీట్లు, 28 పార్లముంటు స్థానాలు పెరుగుతాయని, అందరికీ టికెట్లు లభిస్తాయని అన్నారు. పొత్తులకు తమకు కలిసిరాదని, కుదరదని అన్నారు. బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదన్నారు. తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీకి సిద్ధమని, ఇక్కడ పోటీ చేయాలని ఏమీ లేదన్నారు. ప్రజా సమస్యలపై 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేయబోతున్నట్టు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలన చేశారని, వారిలో ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ అని చెప్పారు.

**కవిత విషయంలో చెప్పేదేమీ లేదు**

కవిత విషయంలో చెప్పేదేమీ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పిల్లలు తండ్రిని సంతోషపెట్టకపోయినా పర్వాలేదు కానీ ఏడిపించొద్దు అని అన్నారు. రాజకీయం ఉంటుంది.. పోతుంది.. కానీ, ఇతరులను బాధపెట్టే తీరు మంచిది కాదు అని సూచించారు. రాజకీయ పార్టీ ఎవరైనా పెట్టుకోవచ్చని, దానికి ప్రజల ఆదరణ ముఖ్యమని తెలిపారు.

**దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం : కేటీఆర్**

రాష్ట్రాన్ని దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యంగా పనిచేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి 30 నెలలైనా ఆ గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా క్యాతన్‌పల్లిలో కాంగ్రెస్ మంత్రి నీచ కృష్ణ రాజకీయాలు చేశారని, కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేసి డబ్బు ఎరగా చూపారన్నారు. అయినా నికార్సైన కార్యకర్తలు ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరిగేలా చూడడం అభినందనీయమన్నారు.

## సౌదీకి పాక్ బలగాలు..

**13 వేల మంది జవాన్లు, 10-18 జెట్ల తరలింపు**



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 12:** పశ్చిమాసియా యుద్ధం వేళ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో సౌదీ అరేబియాకు పాకిస్థాన్ నుంచి భారీ సైనిక, రక్షణ మద్దతు లభించింది. భారీ ఎత్తున సైనిక బలగాలను, యుద్ధ విమానాలను సౌదీ అరేబియాకు పంపినట్టు పలు నివేదికలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన 13,000 మంది సైనికులను, 10 నుంచి 18 యుద్ధ విమానాలను సౌదీ అరేబియాలో మోహరించినట్టు తెలిసింది. వీటిని సౌదీ అరేబియా తూర్పు సెక్టార్‌లోని కింగ్ అబ్దుల్ అజీజ్ ఎయిర్‌బేస్ వద్ద మోహరించినట్టు సమాచారం. ఇరు దేశాల మధ్య గత ఏడాది కుదిరిన వ్యూహాత్మక రక్షణ ఒప్పందంలో భాగంగా ఈ సైనిక మోహరింపు చేపట్టినట్టు పాకిస్థాన్ ప్రభుత్వ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, ఒక దేశంపై జరిగే ఎలాంటి దాడినైనా మరో దేశంపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు.

## ఆశా భోంస్లే కన్నుమూత

మొదటి తరువాయి


సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంగీత సామ్రాజ్ఞి

సంగీత సామ్రాజ్ఞిగా ప్రశంసలందుకున్న ఆశా అందుకున్న గౌరవాల్లో 1981లో 'ఉమ్రావ్ జాన్', 1987లో 'ఇజాజత్' చిత్రాలకు ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా రెండు జాతీయ పురస్కారాలు, 2000లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, 2008లో పద్మవిభూషణ్, జీవిత సాఫల్య పురస్కారంతో సహా తొమ్మిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, రెండు గ్రామీ నామినేషన్‌లు ఉన్నాయి. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ చెల్లెలు ఆశా భోంస్లే. మహారాష్ట్రలోని సాంగ్లీలో 1933, సెప్టెంబర్ 8న జన్మించిన ఆమె, ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు పండిట్ దీనానాథ్ మంగేష్కర్ కుమార్తె. తండ్రి మరణించినప్పుడు, ఆమెకు తొమ్మిదేళ్లు. కుటుంబాన్ని పోషించడానికి ఆమె తన సోదరితో పాటు సినిమాల్లో పాడటం, నటించడం ప్రారంభించారు. లతా మంగేష్కర్ పిఎ గణపతిరావ్ భోంస్లేను ఆమె 16 ఏళ్ల వయసులో ప్రేమవివాహం చేసుకున్నారు. అత్తింటి వేధింపులతో ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి సైతం ప్రయత్నించారు. 1960లో ఆమె భర్త నుంచి విడిపోయారు. 1980లో మ్యూజిక్ డైరెక్టర్ ఆర్‌డి బర్మన్‌ను ద్వితీయ వివాహం చేసుకున్నారు. 1994లో ఆయన చనిపోవడంతో తన పిల్లలు, మనవడు, మనవరాలితో గడుపుతున్నారు.

## జూలై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర..


**ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్**



శ్రీనగర్

అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28 వరకు కొనసాగనుంది. 57 రోజుల పాటు జరిగే ఈ యాత్ర మొదటి బ్యాచ్ జూలై 1న ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. యాత్ర కోసం ఈ నెల 15 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఎల్‌జీ సిన్హా ఆదివారం రాజ్‌భవన్‌లో ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 13 నుంచి 70 ఏండ్లలోపు వయసు గల వారిని యాత్రకు అనుమతిస్తారు. సంప్రదాయ నున్వాన్-పహల్గాం, బలతల్-గండేర్‌బల్ మార్గాల్లో యాత్ర సాగుతుంది. దేశ వ్యాప్తంగా నిర్దేశిత 556 బ్యాంక్ శాఖల్లో లేదా శ్రీ అమర్‌నాథ్‌జీ ష్రైన్ బోర్డ్ వెబ్‌సైట్‌లో యాత్రికులు తమ పేరు నమోదు చేసుకోవచ్చు. యాత్రికులకు ఈసారి ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డులను అందించి వారి భద్రతను ట్రాక్ చేయనున్నారు. వారి ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచారు.

## మధ్యవర్తిత్వానికి సిద్ధం : పుతిన్



మాస్కో : ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం కావటంతో.. పశ్చిమాసియా సంక్షోభంపై మళ్లీ ఆందోళన నెలకొన్నది. ఈ తరుణంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి అనూహ్యమైన ప్రతిపాదన వెలువడింది. అమెరికాతో చర్చల కోసం తాను మధ్యవర్తిత్వం వహిస్తానంటూ పుతిన్ ముందుకొచ్చారు. ఈ విషయాన్ని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో చెప్పినట్టు రష్యా అధ్యక్ష కార్యాలయం 'క్రెమ్లిన్' ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ మధ్య ముఖాముఖి చర్చలు ఎలాంటి ఒప్పందం కుదర్చుకోకుండానే ముగిశాయి. దీంతో రెండు వారాల సీజ్‌ఫైర్‌పై అనుమానాలు నెలకొన్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న వివాదాన్ని రాజకీయ, దౌత్యమార్గంలో పరిష్కరించాలని పుతిన్ ఇంతకుముందు కూడా వాదించారు.

# ఇంటర్ ఫలితాల్లో దూసుకెళ్లిన మిడ్జిల్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల

- టాపర్లతో మెరిసిన మిడ్జిల్ జూనియర్ కళాశాల
- ఎంపీసీ, బైపీసీలో మెరుగైన ఫలితాలు
- మిడ్జిల్ జూనియర్ కళాశాలకు గౌరవం తెచ్చిన విద్యార్థుల ఉత్తమ ప్రతిభ




**మిడ్జిల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తెచ్చారు. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో విద్యార్థులు అధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాలు:**
ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఆర్. సిద్దు 1000 మార్కులకు గాను 959 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. జె. నరేష్ 923 మార్కులతో మరో మంచి ఫలితాన్ని నమోదు చేశాడు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో బరిగేల అక్షిత 826 మార్కులు, బి. అరుణ 804 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాలు:**
ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో శ్వేత 470 మార్కులకు గాను 459 మార్కులు సాధించగా, కృష్ణవేణి 431 మార్కులు సాధించింది. బైపీసీ ప్రథమ సంవత్సరంలో బి. పావని 378 మార్కులు, జయంతి 352 మార్కులు పొందారు. సీఈసీ ప్రథమ సంవత్సరంలో కె. చందు 500 మార్కులకు గాను 422 మార్కులు సాధించాడు.

**ఉత్తీర్ణత శాతం:**
ద్వితీయ సంవత్సరంలో మొత్తం 76 మంది విద్యార్థుల్లో 61 మంది ఉత్తీర్ణత సాధించగా, ప్రథమ సంవత్సరంలో 68 మందిలో 28 మంది మాత్రమే పాస్ అయ్యారు.

**హాజరు లోపం ప్రభావం:**
ఫెయిల్ అయిన విద్యార్థులలో చాలా మంది కళాశాలకు క్రమం తప్పకుండా హాజరు కాలేకపోవడం వల్లే ఫలితాలు దెబ్బతిన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. విద్యార్థులు నియమిత హాజరు పాటిస్తే భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన సూచించారు.

# ఉర్కొండను క్రీడా మండలంగా తీర్చిదిద్దుతాం: ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి






- పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ ఘన ముగింపు -ఉర్కొండకు క్రికెట్ టైటిల్
- గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం - - ఉర్కొండలో ఖేల్ మహోత్సవ్ విజయవంతం

**మిడ్జిల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని ప్రతినిధి):** ఉర్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరి రోజు నిర్వహించిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో మాదారం, ఉర్కొండ గ్రామాల జట్లు తలపడగా, ఉర్కొండ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. మాదారం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే వాలీబాల్ పోటీలలో ఉర్కొండపేట జట్టు ప్రథమ బహుమతి, మాదారం జట్టు ద్వితీయ బహుమతి అందుకుంది. ఈ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సమన్వయకర్త ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించడం ద్వారా దేశ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఖేల్ మహోత్సవ్ ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని పార్లమెంట్ స్థాయి పోటీల్లో రాణించాలని సూచిస్తూ, ఉర్కొండ మండలాన్ని ఉత్తమ క్రీడా మండలంగా అభివృద్ధి చేయడానికి తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, ఉర్కొండ సర్పంచ్ మంజుల, బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, మాదారం సర్పంచ్ మల్లేష్, బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు కరాటే కిరణ్




నాయక్, సందీప్ కుమార్, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగరంలోని 31వ డివిజన్ లో సైడ్ డ్రైన్లు, అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్

- అవినీతి,అక్రమాలు,భూ కబ్జాలకు పాల్పడితే సహించేది లేదు

**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సహకారం, స్థానిక నాయకత్వ ఐక్యతతో సమిష్టి కృషిపాలితంగా వరంగల్ నగరం రూపురేఖలు మారుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి 31వ డివిజన్ పరిధిలోని శాయంపేట , సుభాష్ వీధిలో సైడ్ డ్రైన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం కలిగిన శాయంపేట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత పదేళ్లలో స్థానిక ప్రజలను పట్టించుకోని నాయకులను చూసిన ప్రజలు, ఇప్పుడు అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా చూస్తున్నారని పేర్కొన్నారు. గత రెండేళ్లలోనే ఈ ప్రాంతాన్ని దాదాపు



50 సార్లు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థలు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలల అభివృద్ధి, దేవాలయాల పునర్నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో కొత్త రోడ్లు నిర్మించడంతో అవి మోడల్ కాలనీలుగా మారాయని చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నప్పటికీ, కొందరు ప్రతిపక్ష నాయకులు వాటిని తమ కృషిగా ప్రచారం చేసుకోవడం సరైంది కాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఎందుకు విఫలమయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలో గత ప్రభుత్వాలు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. అదేవిధంగా నగరంలో భూకబ్జా సమస్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. తమ పార్టీకి చెందిన వారైనా, తమ పేరును ఉపయోగించుకొని అవకతవకలకు పాల్పడిన వారైనా కఠిన చర్యలు తప్పవని, అలాంటి విషయాలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు సత్తు రమేష్, వేణు, రాజు, రమేష్ యాదవ్, సురేష్,కృష్ణ,ఇంజినీరింగ్ అధికారులు ఈఈ రవి కుమార్, డిఈ శ్రీకాంత్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెంట తండా అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 12 (నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డ్ అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని కోరుతూ కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని పెంట తండాలో నెలకొన్న ప్రాధాన్య సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సిసి రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి సరఫరా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్థానిక నాయకులతో కలిసి జరిగిన ఈ సమావేశంలో వార్డు అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజల మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరారు..దీనికి స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సూచించిన సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## తెలంగాణ యాదవ జేఏసీ ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సు



**ఆమనగల్లు, ఏప్రిల్ 12 (నేటి దర్శిని ప్రతినిధి):** తెలంగాణ యాదవ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 13న హైదరాబాద్‌లో యాదవ రాజకీయ సదస్సు నిర్వహించనున్నట్లు కల్వకుర్తి నియోజకవర్గ యాదవ జేఏసీ అధ్యక్షుడు జాజాల కుమార్ యాదవ్ తెలిపారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఈ సదస్సు జరగనుంది..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యాదవ రాజకీయ నాయకులు, సంఘాల ప్రతినిధులు, మేధావులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని చెప్పారు. యాదవ సమాజంపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు, మతమార్పిడులను అరికట్టే మార్గాలు, అలాగే విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాల్లో యాదవులకు తగిన వాటా సాధనపై చర్చలు జరగనున్నాయని వివరించారు. అదేవిధంగా డైరీ ఫామ్‌ల స్థాపన ద్వారా ఆర్థికంగా ఎదగడం, సమాజాభివృద్ధికి అవసరమైన కీలక అంశాలపై మార్గదర్శక చర్చలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సామాజిక న్యాయవాది బిపి మండల్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహా సదస్సుకు కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన యాదవ కులబంధువులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండారి రమేష్ యాదవ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్ లో భూపాలపల్లి 2 స్థానం, ములుగు 4 స్థానం...!

- మే 13 నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు
- ఏప్రిల్ 13 నుంచి 20వ తేదీ లోపు పరీక్షల ఫీజు చెల్లించవచ్చు



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ, ప్రథమ సంవత్సరాల ఫలితాలు విడుదలైనాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 82. 34 శాతం సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే ములుగు జిల్లా 82.12% ఉత్తీర్ణత శాతం సాధించి 4 స్థానంలో నిలిచినట్లు అధికారులు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లోని జిల్లాల వారీగా సెకండ్ ఇయర్ లో సాధించిన ర్యాంకుల వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా 82.34% 2వ, స్థానంలో, ములుగు జిల్లా 81. 06%తో 4వ, ర్యాంక్ లో, హనుమకొండ జిల్లా 78.57% 8 స్థానంలో, జనగామ జిల్లా 72.25%తో 18వ స్థానంలో, మహబూబాబాద్ జిల్లా 24.37%తో 30వ స్థానంలో, వరంగల్ జిల్లా 60.80 శాతంతో 34వ స్థానంలో నిలిచాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత శాతం జిల్లాల వారీగా ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా 73.04 శాతంతో3 స్థానం లో, ములుగు జిల్లా 71. 31 శాతంతో5 స్థానంలో, హనుమకొండ జిల్లా 69.16%తో 7 స్థానం లో, జనగామ జిల్లా 59.6%తో 22వ స్థానంలో, వరంగల్ జిల్లా 52.81% 30వ స్థానంలో, మహబూబాబాద్ జిల్లా 49.11 శాతంతో 34 స్థానంలో నిలిచాయి. మే నెలలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మే 13 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని , మే 22 నుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జరుగుతాయని, ఏప్రిల్ 13 నుంచి 20వ తేదీ వరకు సప్లమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## భావ వ్యక్తీకరణల వనం




కళ ద్వారానే ఒక జాతి యొక్క ఆత్మ సాక్షాత్కరిస్తుంది' అంటారు టాగూర్. ఏ దేశ సంస్కృతిలోనైనా కళకు ఒక ప్రత్యేక స్థానం వుంటుంది. ఇది సృజనాత్మకతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని నిర్మిస్తుంది... ప్రోత్సహిస్తుంది. కళ అనేది మనిషి తన భావాలను, ఆలోచనలను, అనుభూతులను... రూపం, శబ్దం, రంగు, కదలికల ద్వారా అందంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించే ఒక ప్రక్రియ. అయితే, ప్రాచీన భారతీయ సాంప్రదాయంలో కళలను 64 రకాలుగా వర్గీకరించారు. వీటిలో చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, నాటకం, సాహిత్యం, సంగీతం వంటివి ప్రధానంగా వున్నా, ఈ కళలకు మాత్రమే పరిమితం కాదు. మొత్తం మానవుని జీవన గమనానికి సంస్కృతి ప్రాతినిధ్యం వహిస్తుంది. భారతీయ సంస్కృతి వేల సంవత్సరాల చరిత్ర, అనుభవం, ఆచార వ్యవహారాల కలయిక. ఈ సంస్కృతిలో ఆట, పాట కేవలం వినోదం మాత్రమే కాదు, మన జీవన విధానంలో అంతర్భాగం. పల్లె గాలిలో మనోహరంగా వినిపించే జానపదాలు, పండుగల్లో ప్రతిబింబించే వివిధ రకాల నృత్య సంప్రదాయాలు, నాటకాలు, తోలుబొమ్మలాటలు భారతీయ ఆత్మకు ప్రతిబింబాలు. ఇవేగాక, కుటుంబ పరంగానూ, రక్త సంబంధీకులతో కలిగివుండే సంబంధ బాంధవ్యాల ద్వారా సంక్రమించే విలువలు, సాంప్రదాయాలు, ఆచారాల వంటివి కూడా సంస్కృతిలో భాగంగా వుంటాయి. అందుకే అంటారు గురజాడ–'దేశమంటే మట్టికాదోరు, దేశమంటే మనుషులోరు' అని. ఇవి ఒట్టి మాటలు కాదు... మన సంస్కృతికి మూలస్తంభాలు. ఆధునికత పేరుతో మన మూలాలను మర్చిపోతున్నాం. పాశ్చాత్య నాగరికత ప్రభావం, మతోన్మాదం మన సంస్కృతిని క్రమంగా కలుషితం చేస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఫాస్ట్ బీట్ మ్యూజిక్, పాశ్చాత్య సంగీతం, సోషల్ మీడియా ట్రెండ్స్, ఫాస్ట్ ఫుడ్, పబ్ కల్చర్... మన మూలాలను మసకబారుస్తున్నాయి. ఒకప్పుడు గ్రామీణ్యంలో కోలాటాలు, తప్పెటగుళ్లు, గొల్లసుద్దులు, పద్య నాటకాలు వంటి ఆట పాటలతో కళలు జనరంజకంగా వుండేవి. ఇప్పుడు టీవీ, మొబైల్ గేమ్స్, రీల్స్, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ఇక మతోన్మాదం కూడా కొత్త రూపం తీసుకుంది. ఇవే కళలను, మాధ్యమాలను తనకనుకూలంగా మార్చుకుంటూ..అసలైన భారతీయతకు వక్రభాష్యాలు చెబుతూ భ్రష్టపరుస్తోంది. 'మన సంస్కృతి--ఆట పాటలు, కళలలో దాగివుంది. దాన్ని కోల్పోతే, మనల్ని మనమే కోల్పోతాం' అంటారు స్వామి వివేకానంద. కళను, కళాకారులను గౌరవించడంతో పాటు మానవ జీవితాల్లో కళ ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో ప్రతి యేటా ఏప్రిల్ 15న 'ప్రపంచ కళా దినోత్సవం' నిర్వహిస్తారు. 'కళ అనేది మాటల్లో చెప్పలేని భావాన్ని వ్యక్తీకరించే ఒక మాధ్యమం' అంటాడు లియోనార్డో డా విన్సీ. ఈయన పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తోన్న ఈ వేడుక-- 'భావవ్యక్తీకరణల వనం: కళ ద్వారా సమాజాన్ని పెంపొందించడం' అనే నినాదంతో ఈ ఏడాదిని ఫలవంతం చేయనుంది. ఒక తోటలో రకరకాల మొక్కలు, విభిన్న వర్ణాల పూలు కలిసి వుంటేనే అందం. సమాజం కూడా అచ్చం అటువంటిదే. భాషలు, ప్రాంతాలు, కుల మతాలకు అతీతంగా మనుషులను ఏకం చేయగలిగే శక్తి ఒక్క కళకే వుంది. ఒక చిత్రం వేల పదాల భావాన్ని వ్యక్తపరిస్తే, ఒక కళ సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తుంది, సమాజాన్ని చైతన్యపరుస్తుంది. కళాకారులు సమాజానికి దిక్సూచీలు. వారు పండించే భావాల తోటలో శాంతి, సహనం, సౌభ్రాతృత్వం వికసించాలి. 'ప్రతి బిడ్డలోనూ ఒక కళాకారుడు వుంటాడు. సమస్యల్లా పెద్దయ్యాక కూడా ఆ కళాకారుడ్ని మనలో ఎలా సజీవంగా వుంచుకోవాలనేదే' అంటాడు పాబ్లో పికాసో. ఏ దేశ సంస్కృతి అయినా నిలబడాలంటే, యువత దానిని గౌరవించాలి. 'మన సంస్కృతిని కాపాడుకోవడం అంటే...దాన్ని జీవవంతంగా వుంచడం, అంతేగాని మ్యూజియంలో పెట్టడం కాదు' అంటారు అంబేద్కర్. మన సంస్కృతిని యువత గౌరవించి, ఆచరించినప్పుడే ఆ సంస్కృతి సజీవంగా వుంటుంది. అలాగని, మూఢత్వాన్ని గుడ్డిగా అనుకరించడం కాదు. మన సంస్కృతిలోని మంచిని స్వీకరించి, కాలానుగుణంగా అభివృద్ధి చేయాలి. జానపద కళలను, స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి. భారతదేశం భిన్న ఆలోచనల సంగమం. ఈ సంగమంలో ప్రతి తరానికి బాధ్యత వుంది. మన సంస్కృతిని పరిపుష్టం చేసి, భవిష్యత్ తరాలకు అందించడమే కళా దినోత్సవం అసలైన ఉద్దేశం.

# ఇరాన్‌కు ఆయుధాలిస్తే చాలాపెద్ద సమస్యలొస్తాయ్..

### చైనాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్

న్యూఢీల్లీ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)

యుద్ధం సమయంలో ఇరాన్‌కు చైనా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు వెలువడిన నివేదికలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌కు ఆయుధాలు పంపితే చైనా తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి చర్యలను ఇకనైనా మానుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. చమురు నౌకల ప్రయాణం కోసం హార్మూజ్‌ను తిరిగి తెరవడానికి వీలుగా సీమైన్స్‌ను తొలగించడంలో తమ దళాలు కృషి చేస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు విఫలమైనప్పటికీ అంతిమ విజయం తమదేనని పేర్కొన్నారు.ఇరాన్‌ను తాము సైనికపరంగా ఓడించామని ట్రంప్ అన్నారు. యుద్ధం విషయంలో నాటో వైపు నుంచి అమెరికాకు ఎలాంటి సాయం లభించలేదని చెప్పారు. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే.. ఇప్పటివరకు



జరిగిన దాడుల్లో దెబ్బతిన్న తమ రక్షణ సామర్థ్యాలను వేగంగా పునర్నిర్మించుకోవడానికి ఇరాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చైనా.. ఇరాన్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలు గుర్తించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. భుజం మీద పెట్టుకొని ప్రయోగించే షార్ట్ రేంజ్ మిసైల్ లాంచర్‌లను, ఇతర క్షిపణి వ్యవస్థలను టెహ్రాన్‌కు సరఫరా చేయడానికి బీజింగ్ ప్రణాళిక రచిస్తున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. వారం రోజుల్లో అవి టెహ్రాన్‌కు చేరే అవకాశం ఉందని తెలిపాయి. తన పేరు బయటకురాకుండా ఉండేందుకు చైనా ఆయుధాలను ఇతర దేశాల మీదుగా ఇరాన్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలను వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎలాంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొన్నది.అయితే చైనా నుంచి ఆయుధాలు అందినట్లు ఇరాన్ బహిరంగంగా వెల్లడించింది. కానీ, తాము అమెరికా విమానాలను విజయవంతంగా కూల్చడానికి చైనా ఆయుధాలను వాడలేదని, తమ అధునాతన రక్షణ వ్యవస్థలే యూఎస్ విమానాలను కూల్చడానికి ఉపయోగపడ్డాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది.

# కర్ణాటక కాంగ్రెస్‌లో పదవుల పందేరం

### -ఢిల్లీకి 30 మంది ఎమ్మెల్యేలు

బెంగళూరు ఏప్రిల్ 12 (నేటి దర్శిని)

కర్ణాటక కాంగ్రెస్‌లో పదవుల పందేరం మరోసారి తెరపైకి వచ్చింది. మంత్రి పదవుల కోసం సుమారు 30 మంది సీనియర్ ఎమ్మెల్యేలు ఢిల్లీ బాటపట్టారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టేలా సీఎం సిద్దరామయ్యపై అధిష్టానం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. (ఖుతీఅఘ్ఖుఝ జశీఅస్త్రతీవంం మీాాం) తమకు మంత్రి పదవులు దక్కకపోవడంపై సుమారు 30 మంది సీనియర్ శాసనసభ్యులు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లైనా తమకు అవకావం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు.కాగా, ఇటీవలి ఉప ఎన్నికల తర్వాత కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ



పునర్వ్యవస్థీకరణ కోసం డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో సుమారు 25 మంది సీనియర్ ఎమ్మెల్యేలు మార్చిలో రహస్యంగా విందు సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రివర్గంలో అవకాశాల కోసం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తేవాలని సమిష్టిగా నిర్ణయించారు. మరోవైపు వ్యూహాత్మక కార్యాచరణ అమలు చేసేందుకు కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. సుమారు 30 మంది ఎమ్మెల్యేలు ఢిల్లీ బాటపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలవాలని ఈ బృందం యోచిస్తున్నది. అలాగే అవకాశాన్ని బట్టి రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలా వంటి సీనియర్ నాయకులను కూడా కలిసేందుకు ప్రయత్నిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక్ పట్టన్ తెలిపారు. కేబినెట్ విస్తరణ కోసమే తమ పర్యటన అని, వేరే అజెండా ఏమీ లేదని స్పష్టం చేశారు.

# ఎన్నికల ప్రచార ర్యాలీలు రద్దు చేసుకున్న టీవీకే అధినేత విజయ్

న్యూఢీల్లీ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)

ఎన్నికల సమయంలో ఏ పార్టీకైనా ప్రచారం చాలా ముఖ్యం. పార్టీ అధినేతలు ఎంత ఎక్కువగా ప్రచారం నిర్వహిస్తే, అంత ప్రభావం ఉంటుంది. అలాంటిది, తమిళనాడులో కొత్త పార్టీ అయిన టీవీకే అధినేత, నటుడు విజయ్ మాత్రం ప్రచార ర్యాలీలు రద్దు చేసుకుంటూ సొంత పార్టీకి షాక్ ఇస్తున్నారు. ఇప్పటికే జరగాల్సిన కొన్ని ర్యాలీల్ని విజయ్ రద్దు చేసుకోగా, షెడ్యూలై ఉన్న మరికొన్ని ర్యాలీల్ని కూడా రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.రెండు రోజుల ముందు వరకు ప్రచారానికి అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 15న విడుదలైంది. ఈ లెక్కన విజయ్ అనేక నియోజకవర్గాల్లో పర్యటించే అవకాశం ఉంది. కానీ, కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ర్యాలీలు, సభలకు హాజరవుతున్నారు. విల్లివక్కం, తిరుచిరాపల్లి, పుదుచ్చేరి, టీనగర్, కుడ్డలూర్ వంటి కొన్ని నియోజకవర్గాల్లో ర్యాలీల్ని రద్దు చేశారు. త్వరలో హాజరవ్వాల్సిన ఇంకొన్ని ర్యాలీల్ని కూడా రద్దు



చేసుకున్నారు. ఇందులో కొన్నింటికి అనుమతులు కూడా తీసుకున్నారు. అయితే, ప్రచార కార్యక్రమాల రద్దు అంశంపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. కానీ, పార్టీవర్గాల ప్రకారం ప్రభుత్వం సరైన అనుమతులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం తమ ప్రచార కార్యక్రమాల్ని అడ్డుకుంటోందని టీవీకే ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఆయన ర్యాలీలకు సమయం తక్కువగా ఇవ్వడం, సరైన భద్రత ఏర్పాటు చేయకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. అలాగే, రవాణాపరమైన సమస్యలు కూడా కారణాలుగా చెబుతున్నారు. ఇక, గత ఏడాది కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అందుకే ముందు జాగ్రత్త చర్యగా, ఇలాంటి ఘటనలు జరగకుండా విజయ్ కొన్ని ర్యాలీలు రద్దు చేస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టీవీకేకు ప్రధాన ఆకర్షణ విజయ్. అలాంటిది ఆయనే ప్రచారానికి రాకపోవడంతో టీవీకే తరపున పోటీ చేస్తున్న నేతలు ఇబ్బంది పడుతున్నారు.


---

# ప్రియుడి సహాయంతో భర్తను హత్య చేయించిన భార్య..

### -దొంగలు కాల్చి చంపినట్లు నమ్మించే యత్నం

భోపాల్ ఏప్రిల్ 12 (నేటి దర్శిని)

ఒక మహిళ తన ప్రియుడి సహాయంతో భర్తను హత్య చేయించింది. భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా దోపిడీ దొంగలు కాల్పులు జరిపి చంపినట్లు నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 8న 27 ఏళ్ల నిలేష్ జాతవ్, 23 ఏళ్ల భార్య రూబీ, తన బిడ్డతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపి హత్య చేశారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జమ్నా గ్రామం నుంచి ఖారికాకు బైక్‌పై తిరిగి వెళ్తుండగా తన బ్యాగ్ రోడ్డుపై పడిపోయిందని రూబీ పోలీసులకు తెలిపింది. భర్త నిలేష్ బైక్‌ను ఆపగా రోడ్డుపై పడిన బ్యాగ్ తెచ్చేందుకు తాను వెళ్లినట్లు



చెప్పింది. దోపిడీకి ప్రయత్నించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తన భర్తను కాల్చి చంపి పారిపోయారని పోలీసులకు వెల్లడించింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తులపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు భార్య రూబీ వాంగ్మూలంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆమె గురించి ఆరా తీశారు. బంధువైన 21 ఏళ్ల ప్రియుడు విశాల్ విమల్‌తో ఆమెకు ఏడేళ్లుగా సంబంధం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేసేందుకు వారిద్దరూ కలిసి ప్లాన్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఇందులో భాగంగా రూబీ కావాలనే తన బ్యాగ్‌ను రోడ్డుపై పడేసింది. భర్త నిలేష్ బైక్ ఆపడంతో అక్కడ మాటువేసిన ప్రియుడు విశాల్, అతడి స్నేహితుడు రాజేష్ కుష్వాహ్ కలిసి కాల్పులు జరిపి అతడ్ని హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఆధారాలు సేకరించిన పోలీసులు రూబీని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నేరాన్ని అంగీకరించడంతో ఆమెతో పాటు ప్రియుడు విశాల్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. నాటు తుపాకీ, ఖాళీ తూటాలు, రిజిస్ట్రేషన్ నంబరు లేని బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రాజేష్ అరెస్ట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.




ఆదివారం రోజు ఆర్ట్ ఆఫ్ లార్నింగ్ అనే ఇంటర్ నేషనల్ సేవ సంస్థ వారు త్యాగరాయ గానసభ హైదరాబాద్, లో బోల్గం నాగరాజు చిల్వేరు సర్పంచ్ కి ఎక్కువ మెజారిటీ వచినందుకు మరియు సహజ వనరులు(ఇసుక )ను కాపాడుటలో ఎల్లపుడు పోరాడుతునందుకు "భారతరత్నం" అనే పురస్కారం మరియు "గ్రామ చక్రవర్తి "అనే బీరుదు తో సత్కారించడం జరిగింది..
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్)

# కవిత రాజకీయ ప్రస్థానానికి మద్దతుగా కందుకూరులో 'పోరు గర్జన'

- ●బైక్ ర్యాలీనిజెండా ఊపి ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి
- ●ప్రశ్నించు-పోరాడు-పరిష్కరించు నినాదంతో ముందుకు కవిత కొత్త పార్టీ
- ●మేడ్చల్ ఆవిర్భావ సభకు జోరుగా సన్నాహాలు..
- ●కందుకూరులో బైక్ ర్యాలీ విజయవంతం





**కందుకూరు, ఏప్రిల్ 12 (నేటి దర్శిని):** తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ఆరంభానికి రంగం సిద్ధమవుతోంది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఏప్రిల్ 25న మేడ్చల్‌లో ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీకి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రంలో ఆదివారం భారీ ఎత్తున 'పోరు గర్జన' బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ జాగృతి ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయకంటి జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి అర్చన సేనాధిపతి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, జిల్లా నాయకులు రామిడి వెంకట్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి, కె. శివశంకర్ తదితరులు హాజరయ్యారు. మోటార్ సైకిళ్లపై వివిధ గ్రామాల నుండి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు కందుకూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తూ కవిత నాయకత్వానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో కవిత కీలక పాత్ర పోషించారని, తెలంగాణ జాగృతి ద్వారా రెండు దశాబ్దాలుగా సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించారని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల సాధికారత కోసం ఆమె మరో రాజకీయ పోరాటానికి సిద్ధమవుతున్నారని అన్నారు. 'ప్రశ్నించు--పోరాడు--పరిష్కరించు' అనే నినాదంతో సామాజిక తెలంగాణ నిర్మాణం లక్ష్యంగా కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించబోతుందని తెలిపారు. గత మరియు ప్రస్తుత పాలకులు ప్రజల ఆశయాలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఏప్రిల్ 25న మేడ్చల్ (మునీరాబాద్)లో జరగనున్న పార్టీ ఆవిర్భావ సభకు రంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం నుండి మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేదభవాని సాయి, కప్పాటి శివరామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఈనెల 19న,చదరంగం పోటీలు



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో అండర్- 7,11,15 సంవత్సరాల బాలబాలికల కు చదరంగం పోటీలను ఈ నెల 19న, నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ పద్మాక్షి కాలనీలోని పద్మిని మినీ ఫంక్షన్ హాల్ లో క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్ -7 విభాగంలో ప్రతిభ కనబరిచిన 4 గురు బాలురు, నలుగురు బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# ఉద్యాన శాఖ ద్వారా రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని బ్యూరో):** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు టమాట ,మిర్చి, వంకాయ లాంటి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సహకాలు అందిస్తుందని తెలిపారు. ఎకరాకు రూ. 9,600 పెట్టుబడి, సాగు చేయడానికి రూపాయలు 8, వేలసబ్సిడీ ఇస్తున్నారని, డ్రిప్ ఇరిగేషన్ కు 70-100 శాతం వరకు రాయితీలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 1,856 ఎకరాల్లో కూరగాయల సాగు కొనసాగుతుందని, పెంచడానికి ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో హయత్ నగర్ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థినుల ప్రతిభ వెలుగు

- ●ఇంటర్ పరీక్షల్లో 98% ఉత్తీర్ణతతో హయత్ నగర్ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల రికార్డు
- ●అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ దేవిరెడ్డి జ్యోతి



**హయత్ నగర్, ఏప్రిల్ 12, (నేటి దర్శిని):** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ హయత్ నగర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఉన్నత మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో దీక్షిత 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, బైపీసీ విభాగంలో నౌషీన్ పర్వీన్ 440కి 435, కీర్తన 440కి 433 మార్కులు సాధించి మెరిశారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో సిరివర్శిని 1000 మార్కులకు గాను 984 మార్కులు, దీవెన కుమారి 979 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. అలాగే బైపీసీ విభాగంలో లాస్య, శుభశ్రీలు తలా 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ విద్యార్థినులు కలిపి 98 శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దేవిరెడ్డి జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థినుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి కొనసాగిస్తామని తెలిపారు. కళాశాల కోఆర్డినేటర్ జి. రమాదేవి మాట్లాడుతూ, విద్యార్థినుల భవిష్యత్తు మరింత విజయవంతంగా, ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

# చైతన్యపురిలో దోమల బెడదపై చర్యలు

- ●చంద్రశేఖర్ రెడ్డి స్వంత నిధులతో ఫాగ్గింగ్ నిర్వహణ
- ●కాలనీల్లో ఫాగ్గింగ్ చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు






**చైతన్యపురి, ఏప్రిల్ 12 (నేటి దర్శిని):** చైతన్యపురి డివిజన్‌లో పెరుగుతున్న దోమల సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి తన సొంత నిధులతో ప్రభాత్ నగర్, సాయి నగర్ కాలనీల్లో ఫాగ్గింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చర్యల ద్వారా దోమల ఉద్ధృతిని తగ్గించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రజలు దోమల కారణంగా వ్యాధులకు గురికాకుండా ఉండటమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాత్ నగర్ కాలనీ అధ్యక్షుడు బాల్ రెడ్డి, సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్ చారి, అలాగే బీఆర్ఎస్ నాయకులు జలంధర్, పులి కిరణ్, నరేష్, శ్రీధర్, గణేష్, మహేష్, నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్య పుట్టినరోజు సందర్భంగా అనాథాశ్రమంలో అల్పాహార వితరణ



- ●కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం



**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని):** దివ్య పుట్టినరోజు సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అనాథాశ్రమంలో అల్పాహార వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో కలిసి సమితి సభ్యులు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఈ చిన్నారుల ముఖంలో కనిపిస్తున్న ఆనందమే, మన సేవా కార్యక్రమాల ద్వారా పిల్లలు ఎంత సంతోషంగా ఉన్నారో తెలియజేస్తోంది" అని అన్నారు. సమాజంలోని అవసరమైన వర్గాలకు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, సభ్యులు సిద్ధార్థ్ పాల్చం, సునీల్ దరాడే, ఎం. స్వామి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల ప్రభంజనం













- రాష్ట్ర స్థాయిలో మెరిసిన శ్రీ ఆకాష్ విద్యార్థులు
- అద్భుత ఫలితాలతో మరోసారి సత్తా చాటిన శ్రీ ఆకాష్ జూనియర్ కాలేజ్
- ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో టాప్ మార్కులతో విద్యార్థుల ప్రతిభ

**మిడ్జిల్, ఏప్రిల్ 12 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదివారం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై. రాజేందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగానికి చెందిన కొట్టే హరీష్ 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో సి. గోపీకృష్ణ 988 మార్కులతో విశేష ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగానికి చెందిన గడ్డమీది స్ఫూర్తి 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో ఎడమొని సుప్రజ 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ విజయానికి సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు యాజమాన్య సభ్యులకు ప్రిన్సిపాల్ వై. రాజేందర్ రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఈ విజయంతో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల మరోసారి తన ప్రతిభను నిరూపించుకుందని ఆయన పేర్కొన్నారు.

# మందమర్రిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ..




**మందమర్రి, ఏప్రిల్ 12:(నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న మందమర్రిలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు అంబేద్కర్ ఆలోచనపరుల వేదిక నిర్వాహకులు తెలిపారు.ఆదివారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేదిక సభ్యులు రామ్ వెంకటేశ్వర్లు,డాక్టర్ గోవర్ధన్,ఎండి ఇసాక్, చందర్,బి.శంకర్ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.డాక్టర్ అంబేద్కర్ వంటి మహనీయుడు భారతదేశంలో జన్మించడం దేశ ప్రగతికి,ప్రజల సంక్షేమానికి ఎంతో దోహదపడిందని వారు పేర్కొన్నారు.రాజ్యాంగ రచన కోసం అహర్నిశలు కృషి చేసి తన జీవితాన్ని అర్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు.అంబేద్కర్ లేకపోతే రాజ్యాంగమే ఉండేది కాదని అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ఆయన పాత్ర విశేషమని తెలిపారు.రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్న ప్రతి ఒక్కరూ ఆయన జయంతిని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉందని చెప్పారు.ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు జయశంకర్ చౌరస్తా నుంచి కోల్‌బెల్ట్ రోడ్డుమీదుగా వివిధ కాలనీల మీదుగా మార్కెట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి,అంబేద్కర్ విగ్రహం వద్ద ముగించనున్నట్లు తెలిపారు.అనంతరం రాత్రి 7 గంటలకు మందమర్రి మార్కెట్ సెంటర్‌లో అంబేద్కర్ చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు."బోధించు--సమీకరించు--పోరాడు" అనే అంబేద్కర్ నినాదంతో సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జే.పోషం,కనకం రవీందర్, దాసరి నరసింహ, పాత వీరస్వామి,దుర్గం రాంబాబు, తుంగపిండి శ్రీనివాస్, అనిల్, డాక్టర్ కట్ల శ్రీనివాస్, సాంబయ్య, తదితరులు, పాల్గొన్నారు.

## డివైడర్ వెడల్పు తగ్గింపు పనులను ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించిన

- ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**చింతలకుంట,12 (నేటి దర్శిని):** చింతలకుంట బస్ స్టాప్ వద్ద ఉన్న డివైడర్ వెడల్పు తగ్గింపు పనులను ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించిన ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ గతంలో పైలెట్ ప్రాజెక్టు కింద చింతలకుంట వద్ద డివైడర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.కానీ అట్టి డివైడర్ దాదాపు పది నుంచి పన్నెండు ఫీట్లు వెడల్పుగా నిర్మించడం వల్ల పలు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో అట్టి డివైడర్ వెడల్పు తగ్గించాలని సుధీర్ రెడ్డి గారు అధికారులకు సూచించారు.ఇట్టి డివైడర్ వెడల్పు తగ్గించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తగ్గించవచ్చు అని తెలిపారు.అలాగే సర్వీస్ రోడ్డు వాళ్ళు కూడా సాఫీగా ప్రయాణం చేయడం జరుగుతుంది అని తెలిపారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ ఎంత మేర డివైడర్ తగ్గించాలో ప్రణాళిక సిద్ధం చేసుకుని దానికి అనుకూలంగా డివైడర్ వెడల్పు తగ్గిస్తామని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి నవీన్ రెడ్డి,సి.ఐ.వెంకటేశ్వర్లు,యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ అధ్యక్షులు రవిముదిరాజ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com సోమవారం 13 -04-2026

# బిజినెస్

## టీసీఎస్‌లో కొలువుల జాతర..


### -ఈ ఏడాది 25,000 మందికి అవకాశం




ప్రస్తుతం ఐటీ రంగంలో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. అనేక సంస్థలు వేలాది మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. అయితే, టీసీఎస్ మాత్రం ఉద్యోగుల్ని నియమించుకునే పనిలో ఉంది. ఐటీ సేవలు అందిస్తున్న ఇండియన్ కంపెనీ టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్). 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ 25,000 మంది ఫ్రెషర్స్‌కు అవకాశం కల్పించనుంది.సంస్థ సీఈవో, ఎండీ కే క్రితివాసన్ దీనికి సంబంధించిన వివరాల్ని వెల్లడించారు. డిమాండ్‌కు అనుగుణంగా కాలేజ్ గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసుకుంటామని తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. ఒకపక్క ఐటీ కంపెనీలకు అవరోధాలు ఎదురవుతున్నా గత ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ మాత్రం 44,000 మంది ఫ్రెషర్లను నియమించుకుంది. దేశంలో గత ఏడాది అత్యధిక నియామకాలు చేపట్టిన ప్రైవేటు కంపెనీగా కూడా నిలిచింది. కొత్తగా ఎంపికైన ఫ్రెషర్లు పూర్తిస్థాయిలో ఉద్యోగంలో చేరేందుకు తొమ్మిది నెలలు పడుతుంది. 9 నెలల శిక్షణ అనంతరం ఉద్యోగులకు ప్రాజెక్టులు అప్పగిస్తారు. ఇదే సమయంలో 12,000 మందిని తొలగించింది. అయితే, ఉద్యోగుల్ని తొలగించేందుకు ఏఐ కారణం కాదని సీఈవో కే క్రితివాసన్ చెప్పారు. కంపెనీలో బాగా పనిచేసినంత కాలం తొలగింపు ఉండదని ఆయన అన్నారు.సీనియర్ లెవల్ ఉద్యోగుల్ని ఎక్కువగా తొలగించినట్లు చెప్పారు. మరోవైపు టీసీఎస్‌లో ఉద్యోగులకు భారీ స్థాయిలో వేతనాలు పెరగబోతున్నట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టీసీఎస్‌కు 40 బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్ దక్కినట్లు తెలుస్తోంది. ఇటీవల నాసిక్ టీసీఎస్‌లో మహిళా ఉద్యోగులపై వేధింపులు వంటి అంశాలతో ఈ సంస్థ వార్తల్లో నిలుస్తోంది.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

### -వరుసగా రెండో రోజు కూడా.. ఇప్పుడు తులం ఎంతంటే..?



బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణపై రోజుకో ప్రకటన రావడం, అనిశ్చితి నెలకొన్న వేళ పసిడి ధరలు ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. యుద్ధం మొదలైన తర్వాత ధరలు పడిపోగా.. ఆ తర్వాత మళ్లీ పెరిగాయి. ఇటీవల ట్రంప్ సీజ్ ఫైర్ ప్రకటించిన క్రమంలో రేట్లు తగ్గా.. కాల్పుల విమరణపై అనిశ్చితి నెలకొన్న వేళ మళ్లీ పెరుగుదల నమోదు చేస్తున్నాయి. దీంతో బంగారం, వెండి ధరలు ఎప్పుడు పెరుగుతాయో.. ఎప్పుడు తగ్గుతాయో ఊహించని పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం వివిధ నగరాల్లో రేట్లు ఎలా ఉన్నాయనేది చూద్దాం.

**గోల్డ్ రేట్లు ఇవే..**

-హైదరాబాద్‌లో ఏప్రిల్ 12వ తేదీన బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెటల్ బంగారం ధర ప్రస్తుతం రూ.1,52,840 వద్ద కొనసాగుతోంది. నిన్నటితో చూసుకుంటే రూ.490 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,40,100 వద్ద ట్రేడువతోంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.450 మేర పెరిగిందని చెప్పవచ్చు.

-విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలు కొనసాగుతున్నాయి.

-ఇక చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,53,820 వద్ద ట్రేడవుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,41,000 వద్ద కొనసాగుతోంది.

-ఇక బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,840 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,100 వద్ద ట్రేడవుతోంది.

-ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,990 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,40,250 వద్ద ఉంది.

**వెండి ధరలు ఇలా..**

-ఇక వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది.

-చెన్నైలో కేజీ సిల్వర్ రూ.2.65 లక్షలుగా ఉంది

-ఇక బెంగళూరులో కేజీ వెండి ధర రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

## క్రెటా సమ్మర్ ఎడిషన్

న్యూఢిల్లీ,

ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్..దేశీయ మార్కెట్లోకి సమ్మర్ ఎడిషన్‌గా క్రెటాను విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.12 లక్షలుగా నిర్ణయించింది. పుష్ బటన్‌తో స్టార్ట్ కానున్న ఈ కారు ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, 26 ఇంచుల డిజిటల్ క్లస్టర్ టచ్‌స్క్రీన్, డ్యాష్‌కామ్ రికార్డింగ్ మోడ్స్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది. ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటర్ ఇండియా నేషనల్ హెడ్ సునీల్ మూల్‌చందాని మాట్లాడుతూ..దేశీయ ఎస్‌యూవీ మార్కెట్లో తనదైన ముద్ర వేసిన క్రెటాకు దేశవ్యాప్తంగా 14 లక్షల కస్టమర్లు ఉన్నారని, అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షలకు పైగా యూనిట్లు అమ్ముడయ్యాయన్నారు. దశాబ్దకాలం క్రితం దేశీయ రోడ్లపైకి




అడుగుపెట్టిన ఈ క్రెటా మాడల్ 1.51 ఎంపీఐ పెట్రోల్ ఇంజిన్, 1.51 యూ2 సీఆర్‌డీఐ డీజిల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దినట్టు ఆయన చెప్పారు.

# స్పోర్ట్స్

## లక్నో గడ్డపై దంచేసిన గిల్, బట్లర్.. గుజరాత్‌కు రెండో విజయం..!

పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరసగా రెండో విజయం సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) త్వరగా ఔటైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను సులువుగా ఎదుర్కొన్న జోస్ బట్లర్(60), గిల్ గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపారు. రెండో వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయం వెంటవెంటనే ఔటైనా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. ఏడు వికెట్లతో గెలుపొందిన గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.సొంత మైదానంలో పంజా విసరాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్( కు భారీ షాకిచ్చింది గుజరాత్ టైటాన్స్. తొలుత ప్రసిధ్ కృష్ణ() సంచలన స్పెల్‌తో లక్నోను 164కే కట్టడి చేసిన గుజరాత్ మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) విఫలమైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని గిల్.. జోస్ బట్లర్(60) స్కోర్ బోర్డును ఉరికించారు. గిల్ కళాత్మక షాట్లతో అలరించగా.. బట్లర్ స్కూప్, రివర్స్ స్వీప్ షాట్లతో చెలరేగాడు.




రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించిన గిల్‌ను ప్రిన్స్ యాదవ్ వెనక్కి పంపాడు. కాసేపటికే షమీ ఓవర్లో బట్లర్ సిక్సర్‌కు యత్నించి బౌండరీ వద్ద మర్క్‌రమ్ స్టన్నింగ్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి రాహుల్ తెవాటియా(10 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. ప్రిన్స్ ఓవర్లో 4, 6 బాదిన సుందర్ లాంఛనం పూర్తి చేశాడు. దాంతో.. వరసగా సన్‌రైజర్స్, కోల్‌కతాపై గెలుపొందిన లక్నోకు ఓటమి తప్పలేదు.

**ప్రసిధ్ దెబ్బకు విలవిల**

పంతొమ్మిదో సీజన్‌లో హ్యాట్రిక్ కొట్టాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ మోస్తర్ స్కోర్‌కే పరిమితమైంది. సొంత మైదానంలో చెలరేగిపోవాలనుకున్న లక్నో జట్టుకు గుజరాత్ టైటన్స్ పేసర్ ప్రసిధ్ కృష్ణ(4-28) షాకిచ్చాడు. పవర్ ప్లేలోనే కగిసో రబడ(1-54), ప్రసిధ్ ధాటికి రెండు వికెట్లు కోల్పోయిన లక్నో ఏ దశలోనూ పుంజుకోలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన గుజరాత్ పేసర్లు లక్నో హిట్టర్లకు బ్యాట్ ఝులిపించే అవకాశమివ్వలేదు.ప్రసిధ్ ధాటికి 69కే మూడు వికెట్లు పడిన వేళ పవర్ హిట్టర్ ఆయుశ్ బదొని(9), నికోలస్ పూరన్(19)లు లక్నోను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ఇద్దరి సైతం వెనక్కి పంపిన ప్రసిధ్ స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు. కుర్రాళ్లు అబ్దుల్ సమద్(18), ముకుల్ చౌదరీ(18) మెరవగా.. ఆఖర్లో ఇంప్యాక్ట్ సబ్ జార్జ్ లిండే(16)ధనాధన్ ఆడడంతో ఆ జట్టు 160 పరుగులు చేయగలిగింది. ఆఖరి ఓవర్లో షమీ(12 నాటౌట్) సిక్సర్ బాదడంతో లక్నో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేయగలిగింది.

## కోల్‌కతాకు గుడ్‌న్యూస్.. యార్కర్ కింగ్ వచ్చేస్తున్నాడు..!



పంతొమ్మిదో సీజన్‌లో పరాజయా పరంపర కొనసాగిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కు గుడ్‌న్యూస్. బోణీ కోసం నిరీక్షిస్తున్న కోల్‌కతాను గెలుపు తోవ తొక్కించేందుకు మథీశ పథిరన సిద్ధమవుతున్నాడు. పొట్టి ప్రపంచకప్ గాయం నుంచి కోలుకున్న పథిరన శ్రీలంక బోర్డు కొత్తగా ప్రవేశపెట్టిన ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. తద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అందుకున్న ఈ యార్కర్ కింగ్ త్వరలోనే కేకేఆర్ స్క్వాడ్‌లో కలువనున్నాడు.మాజీ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలింగ్ కష్టాలు తీరనున్నాయి. ప్రధాన పేసర్లు హర్షిత్ రానా, ఆకాశ్ దీప్‌లు దూరమవ్వడంతో భారీ స్కోర్లు సర్పించుకుంటున్న ఆ జట్టు రాత మార్చేందుకు పథిరన వస్తున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో గట్టెక్కిన ఈ యువ పేసర్ ఒకటి రెండు రోజుల్లో కోల్‌కతా స్క్వాడ్‌లో చేరనున్నాడు. ఏప్రిల్ 14న చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌కు పథిరన అందుబాటులో ఉండే అవకాశముంది. గత సీజన్ వరకూ చెన్నైకి ఆడిన పథిరన ఈసారి ఆ జట్టుతో ప్రత్యర్థిగా తలపడనున్నాడు.

**మూడింటా ఓటమి**

పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను దురదృష్టం వెంటాడుతోంది. ఇప్పటిరకూ ఆడిన నాలుగు మ్యాచుల్లో ఒకటి రద్దవ్వగా.. మూడింటా ఓటమిపాలైన కేకేఆర్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ప్లే ఆఫ్స్ రేసుకు గట్టి పోటీ నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఇకపై ప్రతి మ్యాచ్‌ను భారీ తేడాతో.. మంచి రన్‌రేటుతో గెలిస్తేనే అజింక్యా రహానే బృందం ముందంజ వేసే అవకాశముంది.

## ఆఖరి మెట్టుపై తడబడినా రజతంతో చరిత్ర సృష్టించిన ఆయుశ్..!





బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. అదిరే ఆటతో ఫైనల్ చేరిన ఆయుష్ స్వర్ణానికి బదులు రజతంతోనే సరిపెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో భారత కుర్రాడి జైత్రయాత్రకు చైనా ఆటగాడు షీ యూ కీ చెక్ పెట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన షీ వరస సెట్లలో జోరు చూపించి విజేతగా నిలిచాడు.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆయుష్ శెట్టి సిల్వర్ మెడల్ సాధించాడు. సెమీస్‌లో టాప్ సీడ్‌ను ఓడించిన ఈ కుర్రాడు ఫైనల్లో మాత్రం తేలిపోయాడు. వరస సెట్లలో షీ యూ కీ(చైనా) జోరు ముందు తలవంచిన ఆయుశ్ మ్యాచ్‌ను అప్పగించేశాడు.తొలి సెట్‌ను 8-21తో కోల్పోయిన భారత షట్లర్ రెండో సెట్‌లోనూ పుంజుకోలేదు. 21-10తో గెలుపొందిన షీ పసిడి పతకాన్ని ఎగరేసుకుపోయాడు. 61 ఏళ్ల తర్వాత ఈ లీగ్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆడిన తొలి భారతీయుడిగా చరిత్రకెక్కిన ఆయుష్ రజతంతో సగర్వంగా స్వదేశానికి రానున్నాడు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
సోమవారం 13 -04-2026





# యాంకర్ విష్ణుప్రియపై అసభ్య కంటెంట్ ఆరోపణలు..

## ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు...



యాంకర్ విష్ణుప్రియ భీమినేని చుట్టూ సోషల్ మీడియాలో కొత్త వివాదం చెలరేగింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఏఐఎస్ఎఫ్ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. శనివారం విజయవాడలోని సూర్యారావుపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు అధికారిక ఫిర్యాదు సమర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ నేతృత్వంలో ఈ ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అర్ధనగ్న వీడియోలు వీక్షించాలంటే సభ్యత్వ రుసుము చెల్లించాలని విష్ణుప్రియ ప్రచారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. టెలివిజన్ షోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ఒక ప్రజాప్రతినిధి స్థాయి సెలబ్రిటీ, ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులు డబ్బు కోసం ఇలాంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా కంటెంట్ వల్ల సమాజంలో నైతిక విలువలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఏఐఎస్ఎఫ్ నేతలు రెండు ప్రధాన డిమాండ్లు చేశారు. విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే నిలిపివేయాలి, అలానే ఐటీ చట్టం మరియు సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి ఫిర్యాదు చేసిన సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దీపక్, సిద్దు, మనోజ్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణులను సహించబోమని, అవసరమైతే న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. సోషల్ మీడియా కంటెంట్‌పై బాధ్యత, నైతికత అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఎలా స్పందిస్తారు? విష్ణుప్రియ నుంచి ఎలాంటి క్లారిటీ వస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కాగా, విష్ణు ప్రియ పోవే పోరా షోతో తెలుగు ప్రేక్షకులని పలకరించి మంచి గుర్తింపు సంపాదించింది. అలానే బిగ్ బాస్ షోలోను పాల్గొని సందడి చేసింది.

# ఆకట్టుకుంటున్న 'పాపం ప్రతాప్' ట్రైలర్



'మసూద', 'పరేషాన్' 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్' వంటి వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పాపం ప్రతాప్'. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్ర ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఒక సామాన్యమైన వ్యక్తి జీవితంలో ఎదురయ్యే వింతైన, వినోదాత్మకమైన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. టైటిల్‌కు తగ్గట్టే హీరో 'ప్రతాప్' పడే కష్టాలు, చుట్టూ ఉన్న పరిస్థితులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.సహజసిద్ధమైన నటనతో ఆకట్టుకునే తిరువీర్, ఈ సినిమాలో కూడా తనదైన మేనరిజమ్స్‌తో మరోసారి మెప్పించనున్నాడు. ట్రైలర్‌లో చూపించిన విజువల్స్ మరియు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమా మూడ్‌ను చక్కగా ఎలివేట్ చేశాయి. కేవలం వినోదం మాత్రమే కాకుండా, కథలో ఏదో బలమైన పాయింట్ ఉందనే సంకేతాన్ని ట్రైలర్ ఇస్తోంది. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎస్.పీ దుర్గ నరేష్ దర్శకత్వం వహిస్తుండగా.. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాయల్ రాధకృష్ణ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తు



# నన్ను నేను తెలుసుకున్నా

'గ్యాంగ్‌లీడర్'తో తెలుగు తెరకు పరిచయమైన చెన్నై బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్. ఆ చిత్రంలో పరిమిత భావాలతోనే అందరి హృదయాలనూ కొల్లగొట్టింది. తర్వాత 'శ్రీకారం' సినిమాలో బబ్లీ గాళ్‌గా తన నటనలో మరో కోణాన్ని ఆవిష్కరించింది. 'ఓజీ'లో పవన్‌తో జట్టుకట్టి స్టార్ హీరోయిన్ అనిపించుకుంది. తెలుగుతోపాటు తమిళంలో స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుంది. తాజాగా 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో ప్రేక్షకులను మెప్పించింది. బాక్సాఫీస్ రిజల్ట్ ఎలా ఉన్నా.. ఓటీటీలో ఈ సినిమా రికార్డ్ స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. ఈ సినిమాతో తనను తాను తెలుసుకున్నానంటున్న ప్రియాంక చెప్పిన కబుర్లు ఇవి..చి న్నప్పటి నుంచి నాకు నటనంటే చాలా ఇష్టం. సినిమాలు చూస్తున్నప్పుడు.. నన్ను నేను తెరపై ఎప్పుడు చూసుకుంటానా అనిపించేది. నాతోపాటు ఆ ఇష్టం కూడా పెరిగింది. బయో టెక్నాలజీలో డిగ్రీ చేశానన్న మాటే కానీ, నా మనసంతా సినిమాలపైనే ఉండేది. అందుకే, డిగ్రీ పూర్తవ్వగానే.. అలా అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను.కన్నడ చిత్రసీమ నుంచి వెండితెరకు పరిచయమయ్యా. 2019లో విడుదలైన 'ఒంధ్ కథే హెళ్లా' నా మొదటి సినిమా. ఆ చిత్రం విడుదలైన రోజు నా కల నిజమైంది. మొదటిసారి కెమెరా ముందు నిల్చున్నప్పుడు చాలా ఇబ్బందిగా ఫీలయ్యా. చిత్ర యూనిట్ మద్దతుతో ఒత్తిడిని అధిగమించా. ఆ సినిమా షూటింగ్ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను.నే ను కలిసి పనిచేసిన హీరోలు, నటీనటులు, దర్శకులు, నిర్మాతల నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. వాళ్ల అనుభవం, అంకితభావం, సినిమాపై వాళ్లకున్న ప్యాషన్ నన్నెంతో ప్రభావితం చేశాయి. నాని, శర్వానంద్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. 'ఓజీ'లో పవన్‌కళ్యాణ్ సరసన చేయడం మరచిపోలేని అనుభూతి. 'గ్యాంగ్‌లీడర్' తర్వాత ఎన్నో అవకాశాలు వచ్చాయి. అయితే, పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తాను. సవాలు విసిరే రోల్స్ నాకు ఇష్టం. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించినప్పుడే.. నటిగా గుర్తింపు సాధ్యమవుతుంది. 'మేడ్ ఇన్ కొరియా'తో అలాంటి అవకాశం లభించింది. ఈ సినిమాతో నన్ను నేను తెలుసుకున్నాను అనిపించింది. షూటింగ్స్ లేనప్పుడు కుటుంబంతో గడపడానికే ప్రాధాన్యం ఇస్తా! స్నేహితులతో కాలక్షేపం చేయడం ఇష్టం. పుస్తకాలు బాగా చదువుతాను. బుక్ రీడింగ్ వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. అలాగే ట్రావెలింగ్ అన్నా ఇష్టమే! కొత్తకొత్త ప్రదేశాలు చూస్తున్నప్పుడు మనసుకు ఎంతో రిలీఫ్‌గా అనిపిస్తుంది. ఒత్తిడికి గురైనప్పుడు వంట చేసి రిలాక్స్ అవుతుంటాను.

# డ్రాగన్‌ని ఢీ కొట్టేది తనేనా?!



అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్‌తో దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్)పై ఆడియన్స్‌లో అంచనాలు మామూలుగా లేవు. ఆలస్యం అవుతున్నకొద్దీ అవి అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇందులో విలన్ పాత్ర చాలా కీలకం. దీనికోసం ముందు మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌ని అడిగారు. కానీ టోవినో ఖాతాలో పూర్తి చేయాల్సిన సినిమాలు చాలానే ఉండటంతో 'డ్రాగన్'కు ఆయన ఓకే చెప్పలేకపోయారు.అయితే.. ఇప్పుడు ఈ ప్లేస్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ వచ్చి చేరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో విలన్‌గా షాహిద్ దాదాపుగా ఖరారైనట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయి. ఇదే కనుక నిజమైతే బాలీవుడ్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి బూస్టప్ రావడం ఖాయం. మరి ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. రుక్మిణీవసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి.

# ఉత్కంఠ కలిగించే పరమపద సోపానం



అర్జున్ అంబటి హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. నాగ శివ దర్శకుడు. గణపర్తి నారాయణరావు, తేలప్రోలు ప్రసన్న ఆంజనేయులు నిర్మాతలు. ఈ నెల 24న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు.ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా దర్శకుడు నాగశివ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, అర్జున్ అంబటి నటన, దేవ్ జాండ్ సంగీతం ఈ సినిమాకు హైలైట్స్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఈశ్వర్, సహ నిర్మాత: పులగం సుప్రియ, నిర్మాణం: స్వయంభూ క్రియేషన్స్.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365